ప్రజాశక్తి

గురువారం 11 ఏప్రిల్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

అభివాదం చేస్తూ ముందుకు..

- సంతమాగులూరు చేరిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర
- భారీగా తరలివచ్చిన జనం

ప్రజాశక్తి- సంతమాగులూరు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండల పరిధిలోని వెల్లలచెరువు, కామేపల్లి, అడ్డ రోడ్డు జంక్షన్ మీదుగా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని అయ్యప్ప నగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ స్థలి వద్దకు బుధవారం చేరుకుంది. రూట్ మ్యాప్ లో ఆయా గ్రామాలు లేనప్పటికీ ఎండని సైతం లెక్కచేయకుండా జగన్‌ను చూసేందుకు ప్రజలు అడ్డ రోడ్డు జంక్షన్ వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్నారు. గుంటూరు, కర్నూలు రహదారి వెంట బారులు తీరారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలంలోని గంటా వారి పాలెం వద్ద మంగళవారం ముఖ్యమంత్రి బస చేశారు. అక్కడే ఉగాది పండుగను జరుపుకున్నారు. బుధవారం ఉదయాన్నే రూట్ మ్యాప్ ప్రకారం మండల పరిధిలోని వెల్లలచెరువు, కామేపల్లి, అడ్డరోడ్ ▶ 2లో

ఒంగోలులో ఉద్రిక్తత

- బాలినేని కోడలు ప్రచారంలో వాలంటీరు వివాదం
- టిడిపి నేత మోహన్‌పై వైసిపి నేతల దాడి
- ఎస్‌పి ఆఫీసు వద్ద కార్యకర్తలతో దామచర్ల బైటాయింపు
- ఎంపీ మాగుంట హుటాహుటిన ఎస్‌పి ఆఫీసు వద్దకు రాక



గాయపడిన మేడికొండమోహన్



ఎస్‌పి ఆఫీసు వద్ద బైటాయించిన దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఎన్నికల గొడవలు అప్పుడే మొదలయ్యాయి. ప్రశాంతంగా సాగాల్సిన ఎన్నికల ప్రచారం ఉద్రిక్తతలకు దారితీస్తోంది. ఒంగోలు పట్టణంలోని సమతానగర్‌లో బుధవారం రాత్రి కొట్లాట జరిగింది. దీంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులకు దారితీశాయి. టిడిపి 37వ డివిజన్ అధ్యక్షుడు మేడికొండ మోహన్‌పై వైసిపి కార్యకర్తలు దాడిచేశారు. ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన టిడిపి ▶ 2లో

పథకం ప్రకారమే టిడిపి వారు గొడవ చేశారు

- నా జోలికివచ్చినా ఊరుకుంటా
- నాకుటుంబం జోలికి వస్తే సహించేది లేదు
- ఓడిపోతాననే భయంతోనే జనార్ధన్ అల్లర్లకు తెరతీస్తున్నారు
- సమతానగర్ ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

టిడిపి వారు పథకం ప్రకారమే సమతానగర్‌లో గొడవ చేశారని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఈఘటనపై బుధవారం రాత్రి తన నివాసంలో విలేకర్లతో స్పందించారు. తన కోడలు సమతానగర్‌లో ఎన్నికల ప్రచారానికి వెలితే పథకం ప్రకారమే అడుకున్నారని చెప్పారు. రాజీనామా ▶ 2లో

రాష్ట్రానికి అన్యాయం చేసిన వారిని ఓడించండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పిలుపు
- జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాష్ట్రానికి తీవ్రంగా అన్యాయం చేసిన మతోన్మాద బిజెపిని, దాని మిత్రపక్షాలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా ప్లీనం సమావేశం సుందరయ్యభవన్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వి.శీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి. రమాదేవి పాల్గొన్నారు. సమావేశ తీర్మానాలను పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ పత్రికలకు విడుదల చేశారు. సమావేశంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపిని, దాని మిత్రపక్షాలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న వైసిపిని తిరస్కరించాలన్నారు. డి. రమాదేవి మాట్లాడుతూ వివిధ వర్గాల ప్రజల ప్రయోజనాల రక్షణకు, లౌకిక తత్వం, ఫెడరలిజం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు కాపాడుకోవడానికి పోరాడుతున్న ఇండియా బ్లాక్ అభ్యర్థులను బలపరచాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.

తీర్మానాలు ఇవే...

జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని సిపిఎం ప్లీనం సమావేశం డిమాండ్ చేసింది. ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదైందని, భూగర్భజలాలు అడుగంటాయని, సాగర్‌నీటి విడుదల కూడా తగ్గిపోయిందని తెలిపింది. ప్రస్తుతం జిల్లాలో300కు పైగా గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, 12 మండలాల్లో 182 గ్రామాల్లో నీటి తీవ్రంగా ఉందని తెలిపింది. కేవలం 58 ఆవాసాలకు మాత్రమే ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తుందని తెలిపింది. కనిగిరి, దర్శి, చీమకుర్తి పట్టణాల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రంగా ఉందని పేర్కొంది. జిల్లాలో మంచినీటి పథకాలు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో ప్రస్తుతం నీటి నిల్వలు లేవని తెలిపింది. సాగర్ జలాలు ఇంకా చేరలేదని, రక్షిత మంచినీటి పథకాలు కూడా అధ్వానంగా ఉన్నాయని తెలిపింది. ప్రతి సంవత్సరం నీరు సరఫరా చేస్తున్న ట్యాంకర్ ఆపరేటర్లకు బిల్లులు నేటికీ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని, ఖాళీ బిందెలతో ఆందోళనలు నిర్వహిస్తున్నారని తెలిపింది. ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని సమావేశం ▶ 2లో

మూడేళ్లుగా బంగారు నగలు ఇవ్వలేదని

బ్యాంకు ఎదుట బాధితుల బైటాయింపు



బ్యాంకు ఎదుట బైటాయించిన బాధితులు

ప్రజాశక్తి-బాపట్ల

బ్యాంకులో బంగారు నగలు పెట్టి రుణం తీసుకొని తిరిగి చెల్లించి నప్పటికీ నగలు ఇవ్వక పోవడంతో ఆగ్రహించిన బాధితులు ఆందోళనకు దిగారు. బ్యాంకు ఎదుట బైటాయించి తాళాలు తెరవకుండా అడ్డుకున్నారు. ఈ ఘటన బాపట్లలోని బ్యాంకు ఆఫ్ బరోడా వద్ద బుధవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.... మూడేళ్ల క్రితం బ్యాంకు ఆఫ్ బరోడాలో కొందరు బంగారు నగలు తాకట్టి రుణం తీసుకున్నారు. అనంతరం రుణం చెల్లించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ నగలు ఇవ్వలేదు. అదేమంటే బంగారు ఆభరణాలు మాయమయ్యాని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. అప్పట్లో బ్యాంకులో గోల్డ్ అప్రైజర్‌గా పనిచేసిన వ్యక్తి అప్పటి బ్యాంక్ మేనేజరు కుమ్మక్కై ఖాతాదారులు తాకట్టు పెట్టిన నగలను మణప్పురం సంస్థల్లో తాకట్టుపెట్టినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనపై ఖాతాదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ మూడేళ్లుగా సమాధానం చెప్పేవారు లేరు. గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు బదిలీ అయ్యారు. లక్షలాది రూపాయలు విలువ చేసే బంగారు నగలు తాకట్టుపెట్టిన ఖాతాదారులు కాళ్ల అరిగేలా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా అతిగతి లేకుండా పోయింది. దీంతో ఆగ్రహించిన బాధితులు బ్యాంకు ఎదుట బైటాయించారు. తాకట్టు పెట్టిన నగల కోసం ఇంకా ఎంతకాలం బ్యాంకు చుట్టూ ప్రదక్షిణల చేయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు ఆఫ్ బరోడా అధికారులు ఉన్నత స్థాయిలో విచారణ జరిపించి బ్యాంకులో బంగారాన్ని అపహరించిన నిందితులపై చర్యలు తీసుకొని తమ బంగారు ఆభరణాలు ఇప్పించాలని వారు కోరారు. లేకుంటే నగలు ఇచ్చేవరకూ బ్యాంకు ఎదుట ఆందోళన కు దిగుతామని వారు హెచ్చరించారు.

ఒంగోలులో ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధన్ అక్కడకు చేరుకున్నారు. తమ కార్యకర్తలపై వైసిపి దాడి జరిగిన తీరును పరిశీలించారు. వెంటనే సమీపంలోని ఎస్‌పి కార్యాలయానికి కార్యకర్తలతో వెళ్లి బైటాయించారు. గాయపడ్డ మోహన్‌ను అక్కడ కూర్చోబెట్టి నిరసన వ్యక్తం చేశారు. దాడి చేసిన వైసిపి గూండాలపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యకర్తలు, నేతలను అరెస్టు చేయాలని డిమాండు చేశారు. ఎస్‌పి ఆఫీసును ముట్టడించారు.పోలీసులు పెద్దఎత్తున చేరుకుని ఇరు వర్గాలను అదుపుచేసే యత్నం చేశారు. అరుపులు కేకలతో ఎస్‌పి ఆఫీసు వద్ద తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ముట్టడి జరుగుతున్న సమయంలోనే ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కూడా ఎస్‌పి ఆఫీసు వద్దకు చేరుకున్నారు.నేతలు ఎస్‌పిని కలిసి ఫిర్యాదు చేశారు. సంఘటనకు కారణాలను పరిశీలిస్తే... సమతానగర్ ఒకటోలైనులో వెంకటేశ్వరగుడి వద్ద మాజీ మంత్రి బాలినేని కోడలు ఎన్నికల ప్రచారానికి వెళ్లారు.అక్కడ ఓ అపార్టు మెంటులో ప్రచారం నిర్వహిస్తున్నారు.వీరిలో స్థానిక వాలంటీరు ఉండటాన్ని గమనించిన అపార్ట్‌మెంట్ నివాసి చప్పిడి ప్రభావతి అనే మహిళ తన ఫోన్‌లో వాలంటీరు ఫొటోను తీశారు. వాలంటీర్ ఎన్నికల ప్రచారానికి ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. ఫొటో ఎందుకుతీశాంటూ వైసిపి కార్యకర్తలు ప్రభావతిపై దాడిచేశారు. ఈ గొడవ విషయం తెలుసుకున్న తెలుగుదేశం, జనసేన నాయకులు అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. తెలుగుదేశం నేతలపై వైసిపి కార్యకర్తలు దాడిచేశారు. ఈ దాడిలో 37వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు మోహన్‌రావు తలకు, కంటివద్ద గాయాలయ్యాయి. వెంటనే గొడవ సమాచారాన్ని దామచర్లకు చెప్పారు. ఆయన హుటాహుటిన అక్కడకు చేరుకుని బాధితులను పరామర్శించారు. బాధితులను తీసుకుని ఎస్‌పి కార్యాలయానికి చేరుకున్నారు. ఇరువర్గాలను పోలీసులు అదుపు చేసేయత్నం చేశారు. ఎస్‌పి కార్యాలయంవద్ద పోలీస్ దళాలు మోహ రించాయి. దాడి విషయం తెలుసుకున్న తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున ఎస్‌పి కార్యాలయానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న తెలుగుదేశం నేతలను శాంతింపజేసేందుకు పోలీసులు ప్రయత్నం చేశారు. ఎంపీ మాగుంట, దామచర్ల జనార్ధన్ ఎస్‌పిని కలిశారు. ఘటన గురించి వివరించారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్‌పి హామీ ఇచ్చినట్లు ఎంపీ మాగుంట, దామచర్ల తెలిపారు.

పథకం ప్రకారమే టిడిపి వారు గొడవచేశారు

(మొదటిపేజీ తరువాయి)

చేసిన వాలంటీరును నానా యాగి చేశారని, తన కోడల్ని ఇష్టారీతిన మాట్లాడారని తెలిపారు. ఇదంతా ఓ పథకం ప్రకారమే జరిగిందన్నారు. తన జోలికి వస్తే అనేకసార్లు ఊరుకున్నానని, తన కుటుంబ సభ్యుల జోలికి వస్తే కార్యకర్తలు స్పందించారా..?అని ఆయన ప్రశ్నించారు. తన కుటుంబసభ్యుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. దామచర్ల జనార్ధన్ ఓటమి భయంతోనే ఒంగోలులో అల్లర్లు సృష్టించేందుకు పథక రచన చేస్తున్నారని తెలిపారు. తమ కార్యకర్తలను రెచ్చగొడితే వాళ్లు ఊరుకుంటారా..? అని ప్రశ్నించారు. గతంలో తాను కమ్మపాలెం వెలుతుంటే అడ్డుకున్నారని, అయినా ఈ ఐదేళ్ల కాలంలో కులాలకు అతీతంగానే రాజకీయాలు చేశానని చెప్పారు. కులాలు అందరికీ ఉన్నాయని, ఇష్టంలేక పోతే ఓట్లు వేయవద్దే తప్పా దాడులకు పాల్పడటం ఏంటని ప్రశ్నించారు. తమ పార్టీ కార్యకర్తల మీద దాడిచేసి తమ వారిమీదే పోలీసులకు ఫిర్యాదు చేయడం ఏంటని ప్రశ్నించారు. తాను పిలిస్తే కూడా జనాలు వేలల్లో వస్తారని వ్యాఖ్యానించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి విషయం తెలుసుకోకుండా మాట్లాడటం తగదన్నారు. అక్కడ జరిగిన వివాదం గురించి పూర్తి సమాచారం తెలుసుకొని ఎంపీ స్పందించి ఉంటే బాగుండేదన్నారు. ఈ కార్యక్రమంలో బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, వైసిపి నగర అధ్యక్షుడు కటారి శంకర్ పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం : జేసీ

ప్రజాశక్తి-చీమకుర్తి

సంతనూతలపాడు నియోజక వర్గంలో ఎన్నికల ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం లోని నాలుగు మండలాలలో 587 మంది పిఒలు, ఎపిఒలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణకు గైర్హాజరైన 34మందికి జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 256 పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. మద్దిపాడు గ్రోత్‌సెంటర్, నాగులుప్పలపాడులలో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న రూ.3,83,900 సీజ్ చేసినట్లు తెలిపారు. వివిధ పార్టీల ఎన్నికల ఖర్చుల క్రింద ఇప్పటి వరకు రు.20,53,362 నమోదు చేసినట్లు తెలిపారు. మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్లు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

15 నుంచి చేపల వేట నిషేధం

ప్రజాశక్తి-రేపల్లె

ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో చేపల వేటపై నిషేధం విధించినట్లు రేపల్లె మండలం ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్‌కె కౌసర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సముద్ర చేపలు, రొయ్యల సంతా నోత్పత్తికి, వాటి సంతతి పెరుగుదలకు, సముద్ర మత్స్య సంపదను సుస్థిర పరిచేందుకు 2024-25 సంవత్సరానికి గాను ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు మొత్తము 61 రోజులు సముద్రంలో యంత్ర, మోటారు పడవలతో వేటపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. రేపల్లె రెవెన్యూ డివిజన్‌లోని నిషేధిత కాలంలో సముద్రంలో వేటకు వెళ్లవద్దని ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకొని, వారి బోట్లకు జరిమానా విధించి, బోటులో ఉండే మత్స్య సంపదను స్వాధీన పరచు కుంటామన్నారు. డీజిల్ ఆయిల్ రాయితీతో పాటు ప్రభుత్వం అందించే పథకాలన్నీ నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. బోటు యజమానులు తమ పడవలకు కలర్ కోడింగ్ వేయించకుండా వేట నిషేధ కాలంలోనే కాక ఇతర సమయాలలో కూడా వారికి ఆయిల్ సబ్సిడీ నిలిపి వేస్తారన్నారు. లైసెన్సు రద్దవు తుందన్నారు. మత్స్యకార వేట నిషేధ కాల భృతికి కూడా అర్హులు కారని తెలిపారు.

రాష్ట్రానికి అన్యాయం చేసిన వారిని ఓడించండి

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేసింది. తాగునీటి కొరత ఏర్పడిన అన్ని గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, చెడిపోయిన బోర్లను రిపేరు చేయాలని, సాగర్ నీటి ద్వారా తాగునీటి చెరువులు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు సంపూర్ణంగా నింపాలని డిమాండ్ చేసింది. మంచినీటి పథకాల రిపేర్లు, పర్యవేక్షణ చేయాలని, ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చేసేందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని, నిర్మాణ దశలో ఉన్న మంచినీటి పథకాలను పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమా వేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి. కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎస్‌కె.మాబు, ఎం.రమేష్, డి.సోమయ్య, ఊసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తూ ముందుకు..

(మొదటిపేజీ తరువాయి)

జంక్షన్ మీదుగా అయ్యప్ప నగర్‌కు చేరుకున్నారు. ప్రజలకు అభివాదరం చేస్తూ సభా స్థలి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మల్లిపుల్‌హై అటెన్యూయేషన్ గడ్డలతో ఆసిఫైయింగ్ ఫైబ్రోమాతో బాధపడుతున్న సంత మాగులూరు మండలం కొమ్మాలపాడుకు చెందిన పదహారేళ్ల బాలుడు షేక్ హుస్సేన్ బాషాను వారి తల్లిదండ్రులు సిఎం వద్దకు తీసుకొచ్చారు. సమస్యను సిఎంకు వివరించారు. దీంతో స్పందించిన సిఎం హుస్సేన్ బాషాకు వైద్య సహాయం అందించేందుకు బాలుడి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. చిన్నారి వైద్య అవసరాలను తక్షణమే తీర్చాలని ఆరోగ్యశ్రీ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్, మంత్రి అంబటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

శింగరాయకొండ: టంగుటూరు మండల టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, మాజీ ఎంపిపి చదలవాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'రాక్షస కళ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-రేపల్లె: యుక్తులు కుయుక్తులు సమయ స్ఫూర్తి తెలిసినవారికి విజయం లభిస్తుందని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం సనక వెంకట సుధీర్ విరచిత 'రాక్షస కళ.. ప్రపంచాన్ని మీకు దాసోహం చేయించే క్రీడ' అనే పుస్తక ప్రమోషన్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ రచయిత సనగా వెంకట సుధీర్ నాలుగు సంవత్సరాల కఠోర శ్రమతో పుస్తకాన్ని రాశారన్నారు. ఈ పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారని చెప్పారు. రేపల్లె శాసన సభ్యులు అనగాని సత్యప్రసాద్ సైతం పుస్తకాన్ని చూసి ప్రశంసించడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకం చదవాలని సూచించారు. కార్యక్రమంలో రచయిత సనక వెంకట సుధీర్, డాక్టర్ సిహెచ్ బాబావలి రావు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి పట్టణంలో 2కిలోల 260 గ్రాముల గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇరువురు నిందితులను అరెస్టు చేశారు. వివరాలలోకి వెళితే.. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎక్సైజ్ సిఐ ఇ మారయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం చీమకుర్తి పట్టణంలో సోదాలు నిర్వహించారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన యుదిష్టర్ స్థానికంగా హెయిర్ కట్ సెలూన్‌లో పనిచేస్తూ, గ్రానైట్ ఫ్యాక్టరీలలో పనిచేసే కూలీలకు గంజాయిని విక్రయిస్తుంటాడు. పేర్నమిట్టలో సెంట్రింగ్ పనిచేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన గోలంమండల్‌కు గంజాయిని సప్లయి చేసి, విక్రయాలు జరుపుతున్నాడు. పేర్నమిట్ట ప్రాంతంలోని గ్రానైట్ ఫాక్టరీలలో పనిచేసే కార్మికులకు కూడా గంజాయిని సప్లయి చేస్తున్నారు. యుదిష్టర్ ఒరిస్సా రాష్ట్రంలోని అటవీ ప్రాంతంలో గిరిజనుల నుంచి గంజాయి సేకరించుకొని వచ్చి ఈ ప్రాంతంలో అమ్మకాలు సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి ఇరువురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఈ సందర్భంగా సిఐ మారయ్య మాట్లాడుతూ చీమకుర్తి సెబ్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎవరైనా గంజాయి అమ్మకం చేసినా, తాగినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ వనితారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ యాసుఫ్ షరీఫ్, కెవి రామిరెడ్డి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సిఐ మారయ్య



చికిత్స పొందుతున్న సురభి షద్రక్

పరస్పర దాడులపై కేసు నమోదు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

డాబా హెూటల్‌లో ఘర్షణ జరిగి ముగ్గురు యువకులు గాయపడిన ఘటనలో ఇరువర్గాల మీద కేసులు నమోదు చేసినట్లు మార్టూరు సీఐ ఎస్‌వి రాజశేఖరరెడ్డి బుధవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. కోలలపూడి గ్రామానికి చెందిన సరిమెళ్ల వేణు తన మిత్రులు గాలి సుధీర్, సురభి షద్రక్ మరికొంతమంది యువకులతో కలిసి ద్రోణాదుల-నాగండ్ల రహదారి మధ్యలో ఉన్న రాయల్ డాబా హెూటల్‌లో ఫుడ్ ఆర్డర్ ఇచ్చారు. ఈ క్రమంలో హెూటల్ సిబ్బంది ఇచ్చిన కూరలో రాళ్లు వచ్చాయని సర్వర్‌ని ప్రశ్నిస్తుండగా హెూటల్ యజమాని పాలేపు వెంకట్రావు అయన కుమారుడు రామాంజనేయులు వీళ్ల దగ్గరకు వచ్చి మా హెూటల్‌కు రావద్దంటే ఎందుకు వచ్చారంటూ కులం పేరుతో దూషించి యువకులపై సిబ్బందితో విచక్షణారహితంగా జరిపిన దాడిలో గాయపడటంతో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జరిగిన ఘటనపై సురభి షద్రక్ ఇచ్చిన ఫిర్యాదుతో తండ్రీ కొడుకులపై ఎస్సి ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అదే విధంగా తమ హెూటల్ సిబ్బందిపై కొంతమంది యువకులు ఘర్షణకు దిగి దాడికి పాల్పడ్డారంటూ హెూటల్ యజమాని పాలేపు వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదుపై కూడా కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఎవరైనా దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.



షర్మిలను కలిసిన ఆమంచి, కాంగ్రెస్ నాయకులు

చీరాల కాంగ్రెస్ సభకు షర్మిలకు ఆహ్వానం

ప్రజాశక్తి-వేటపాలెం: బెంగళూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను బుధవారం వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన చీరాల మాజీ శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్ ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలోకి తనను ఆహ్వానించినందుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. చీరాలలో జరగబోయే బహిరంగ సభకు ఆహ్వానించారు. చీరాల నియోజక వర్గంలో 20 వేల మంది జన సమీకరణతో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆమంచి కృష్ణమోహన్ అనుచరులు తెలిపారు. ఈ బహిరంగ సభ 4,5 రోజుల్లో ఏర్పాటు చేయను న్నట్లు తెలుస్తోంది. ఆమంచి కృష్ణమోహన్‌తో పాటు మాజీ ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రెగొరీ, చీరాల రూరల్ సీనియర్ నాయకులు మేడిబో యిన బలరామిరెడ్డి, వేటపాలెం మండల సీనియర్ నాయకులు బండ్ల బాబు, చీరాల సీనియర్ నాయకులు కోటి దాసు, మాజీ కౌన్సిలర్ శీలం శ్యామ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బజ్జి బాబు, షేక్ రెహ్మాన్, యండ్రపాటి సునీల్, వైఎస్ షర్మిలను మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

మద్యం అక్రమ నిల్వలపై చర్యలు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రేపల్లె

ప్రభుత్వం నియంత్రించిన మద్యం అక్రమ రవాణా చెలామణి, నిల్వలు, విక్రయాలు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసరావు హెచ్చరించారు. రేపల్లె సెబ్ సర్కిల్ కార్యాలయంలో అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ముఖేష్ కుమార్ మీనా, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఐజి రవి ప్రకాష్ ఆదేశాల మేరకు ఎన్నికల్లో మద్యం నిరోధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం పంపకాలను అరికట్టేందుకు అధికారులకు పలు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ చేసే వారిపై, రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా, అక్రమ మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం అమ్మకాలు చేసినా, ఎన్నికల కోసం దాచిపెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రావు, సర్కిల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభిమానులతో 'మద్దిశెట్టి' సమావేశం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ దర్శిలో ఆయన అభిమానులతో బుధవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి అందరితో మాట్లాడారు. జనవరి తర్వాత మూడు నెలలు అనంతరం ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా కలిసి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త లలిత సాగర్‌ఎమ్మెల్యేని కలిసి ఎన్నికల్లో తమకు సహకరించాలని కోరారు. అనంతరం అభిమానులతో రాత్రి వరకూ మాట్లాడుతూనే ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ షకీలా మిల్లర్, బుజ్జి, తాళ్లూరు, కురిచేడు ఎంపీపీలు తాటికొండ శ్రీనివాసరావు, బెల్లం చంద్రశేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాచగొర్ల వెంకటయ్య, ఎర్రయ్య, కర్ణ శ్రీను, సాంబయ్యతోపాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి-వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాలలో ఇటీవల నిర్వహించిన ఒయాసిస్ ఆటోమేషన్ టెక్నాలజీస్' వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఒయాసిస్ ఆటోమేషన్ టెక్నాలజీస్ వారు క్యాంపస్ సెలక్షన్స్ కళాశాలలో బిటెక్ (ఇఇఇ, ఇసిఇ బ్రాంచిలలో) 2024 విద్యా సంవత్సరంలో పూర్తి చేయబోయే విద్యార్థులకు, 2023లో పూర్తి చేసిన కళాశాల విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ కళాశాలలోని రిక్రూట్మెంట్ ఫెసిలిటీలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఎంపికలకు 70 మంది ఆన్‌లైన్ పరీక్షకు హాజరు కాగా అందులో 30మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. అందులో 18 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలియజేశారు. బిటెక్ విద్యార్థులు ఇసిఇ బ్రాంచి విద్యార్థులు 15 మంది, ఇఇఇ బ్రాంచి విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు తెలిపారు. బిటెక్ విద్యార్థులకు నెలకు రూ.18 వేల వేతనం, ఇతర అలవెన్సులు ఉంటాయన్నారు.

టిడిపితోనే ముస్లిం మైనారిటీల సంక్షేమం: ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్లో బుధవారం సాయంత్రం ముస్లిం మైనారిటీ సెల్ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి కనిగిరి టిడిపి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పై వైసీపీ తప్పుడు ప్రచారాలను చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేయడం సమంజసం కాదని అన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న వైసీపీపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు. ముస్లిం మైనారిటీలు వైసిపి అసత్య ప్రచారాలను నమ్మడం లేదని టిడిపికి మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం హయాంలో ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ఎంతగానో కషి చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, షేక్ బారాయి మామ్, గుడిపాటి ఖాదర్, నాయబ్ రసూల్, కరాటే యాసిన్, కాసిం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర



ఇంటింటి ప్రచారంలో కల్పనారెడ్డి, అరుణారెడ్డి

అంబేద్కర్ జయంతి సభకు తరలి రావాలి

ప్రజాశక్తి-వెలిగండ్ల

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కనిగిరి లోని అమరావతి క్యాంపు కార్యాలయంలో ఈనెల 14వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్ కుమార్ తెలిపారు. బుధవారం వెలిగండ్లలోని టిడిపి కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కనిగిరి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు. కనిగిరి నియోజక వర్గంలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చి అంబేద్కర్ జయంతి సభను దిగ్విజయం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

'సంక్షేమం' అందించిన ఘనత వైసీపీదే

ప్రజాశక్తి-గిద్దలూరు: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని వైసిపి గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి సతీమణి కల్పనారెడ్డి, సోదరి అరుణారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 3వ వార్డులో వారు ఇంటింటి ప్రచారంలో పాల్గొని, ఇంటింటికీ సంక్షేమ కరపత్రాలను అందించారు. సీఎం జగన్ గడచిన ఐదేళ్లలో జనరంజక పాలన అందించారని, సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో గిద్దలూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కుందురు నాగార్జున రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలకు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, వేయించి గెలిపించాలని వారు ప్రజలను అభ్యర్థించారు.

మినీ హెల్త్ సెంటర్ సందర్శన

ప్రజాశక్తి-పిసి పల్లి

పిసిపల్లి మండలంలోని పెదఈర్లపాడు గ్రామంలో మినీ హెల్త్ సెంటర్‌ను సర్పంచ్ పోలం లక్ష్మీదేవి బుధవారం సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి డాక్టర్ మంజులారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉండేలా పిచ్చిరెడ్డి, మాదాసు చిన్నబ్రహ్మయ్య, భైరబోయిన రత్తయ్యయాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కావూరి రఘుచంద్

హోమియో దినోత్సవం

ప్రజాశక్తి - అద్దంకి

ప్రపంచ హోమియో దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మన్నం త్రిమూర్తులు కార్యాలయంలో హెూమియోపతి పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనీమున్ 270వ జయంతిని ప్రజారోగ్య వేదిక, పట్టణ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. హెూమియో డాక్టర్ కావూరి రఘుచంద్ మాట్లాడుతూ హనీమాన్ దీర్ఘకాలిక వ్యాధులు, తరుణ వ్యాధులపై అన్ని వైద్య విధానాలపై పరిశోధన చేసి హెూమియోపతి ఏకైక సైడ్ ఎఫెక్ట్స్ లేని మంచి వైద్యమని నిర్ధారించారని చెప్పారు. ఈసందర్భంగా వేసవిలో వడదెబ్బ నివారణ గురించి డాక్టర్ రఘుచంద్ వివరించారు. వడదెబ్బకు నేట్రమోర్ 30ఎంతో ఉపయోగకరమైన పిల్స్ అని అన్నారు. ఎండలోకి వెళ్లేటప్పుడు రోజు ఐదు పిల్స్ వేసుకుంటే వడదెబ్బ నుండి నివారణ పొందవచ్చని అన్నారు. హెూమియోపతి పిల్స్‌ను చేబ్రోలు వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. నేత్రమోల్ 30 కావలసినవారు పట్టణ ప్రజా సంఘాల ప్రతినిధులను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, చంద్ర, మరిదాస్, శ్రీను పాల్గొన్నారు.



తూటాలకు బలైన అమరవీరులకు సిపిఎం నివాళి

సిపిఎం అమరులకు నివాళి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని గాజులలంక గ్రామానికి చెందిన బావిరెడ్డి వియ్యమ్మ, సనక సుబ్బారావు, బావిరెడ్డి వెంకటేశ్వర్లు, మట్టి సుబ్బారావు స్థూపాల వద్ద సిపిఎం నాయకులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వేములపల్లి వెంకట రామయ్య మాట్లాడుతూ చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజలను ఏకం చేసి భూమి లేని పేదలకు భూమి పంచాలని, కూలి రేట్లు పెంచాలని పోరాడిన నాయకులు బాబిరెడ్డి వియ్యమ్మ, సనక సుబ్బారావు, బాబిరెడ్డి వెంకటేశ్వర్లు, మట్టి సుబ్బారావు అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో చట్టసభల్లో ప్రజలు గొంతు వినిపించాలంటే వామపక్ష అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మాజీ ఎంపీపీ అమర్తులూరి కృపానందం, సనక అగ్గి రామయ్య, సిపిఐ నాయకులు బాబిరెడ్డి ప్రభాకరరావు, సిపిఎం నాయకులు బి సుబ్బారావు, గోపరాజు ప్రసాదు, కొల్లూరు వెంకటలక్ష్మి, సుబ్బయ్య పాల్గొన్నారు.



ప్రచారంలో ఓట్ల అభ్యర్థిస్తున్న అశోక్ బాబు

వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - వేమూరు

వైసీపీ అభ్యర్థి వరికుటి అశోక్ బాబు అమృతలూరు మండలంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎండను సైతం లెక్కచేయకుండా ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. గ్రామాల్లో పర్యటిస్తూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి పట్టం కట్టాలని కోరారు. ఆయన వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్ర వ్యాప్తంగా ఎంసెట్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ పేపర్స్ చైతన్య కాలేజీ పరీక్ష కేంద్రంలో ప్రభుత్వ దంత వైద్యులు డాక్టర్ శ్రీపతి శివప్రసాద్ ఒపెన్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేయటం తోపాటు విద్యార్థును చదువుల్లో ప్రోత్సహిస్తుందని అన్నారు. మేధావులతో ఎంసెట్ నమూనా ప్రశ్నాపత్రం తయారు చేయించి గత 25ఏళ్లుగా ఎస్‌ఎఫ్‌ఐ మోడల్ ఎంసెట్ పరీక్షలు నిర్వహిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మే 18 నుంచి నిర్వహించే ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ మోడల్ ఎంసెట్ ఉపయోగపడుతుందిని అన్నారు. ఈ మోడల్ ఎంసెట్ పరీక్ష నిర్వహణలో ఎస్‌ఎఫ్‌ఐ రేపల్లె డివిజన్ ఉపాధ్యక్షులు వై నవీన్, రేపల్లె చైతన్య కాలేజీ వైస్ ప్రిన్సిపల్ బి తిరుమలరావు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హైమ, నాగశ్రీ, వంశీ పాల్గొన్నారు.



ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీపతి శివప్రసాద్

బిజెపి కూటమిని ఓడించండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి - బాపట్ల

దేశవ్యాప్తంగా కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న బిజెపిని, రాష్ట్రంలో బిజెపిని బలపరుస్తున్న పార్టీలను ఓడించి కార్మికులుకు అండగా ఉండే ఇండియా కూటమిని గెలిపించాలని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి కోరారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం జరిగిన సీఐటీయు జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి సీఐటీయు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్మిక హక్కులు హరించేవిధంగా చట్టాల్లో మార్పులు చేసిందని అన్నారు. కార్మిక చట్టాల్లో మార్పులు వల్ల అనేక మంది ఉద్యోగులు కోల్పోయి రోడ్డున పడ్డారని అన్నారు. కార్మికుల మధ్య మతం, కులం పేరుతో చీలికలు తేస్తూ దేశంలో విచ్ఛిన్న కర పరిస్థితులు సృష్టిస్తోందని అన్నారు. కొవిడ్‌లో కోట్లాది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కార్మికులు, ఉద్యోగుల హక్కు లు కోసం రోడ్డెక్కితే అక్రమ అరెస్టులు చేసి జైలుకు పంపు తున్నారని అన్నారు. ఉద్యోగాలు నుంచి తొలగిస్తామని బెదరిస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉన్నా పార్టీలను కార్మికవర్గం వ్యతిరేకించాలని సూచించారు. రాజ్యాంగంలో కార్మికల హక్కులను కాపాడుకోవటానికి ఇండియా కూటమిని బలపర్చాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుం దార్, నాయకులు కె శ్రీనువాసరావు, సిహెచ్ గంగయ్య, కె లక్ష్మి, ఎం వెంకటేశ్వరమ్మ, టి పుణ్యాలక్ష్మి, కె శరత్ బాబు, పి ఆదాము, బుచ్చిరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

బోడవాడ గ్రామంలో విషాదం

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి.. రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - పర్చూరు

ఒక్కగానొక్క కొడుకు. అతని తల్లి గతంలోనే మృతి చెందారు. కొడుకుపై ఉన్న ప్రేమతో ఆ తండ్రి మరో వివాహం చేసుకోలేదు. కొడుకు ఉన్నతంగా చదివించి మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఆ తండ్రి కలలు కన్నాడు. అందుకు తగ్గట్లుగానే ఉన్నత చదువుల కోసం అమెరికా పంపించారు. అయితే విధి వక్రించింది. రోడ్డుపై మంచుగడ్డల రూపంలో మృత్యువు వెంటాడింది. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన మండలంలోని బోడవాడకు చెందిన యువకుడు ఆచంట రేవంత్ (22) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని మృతదేహం ఆయన బుధవారం స్వగ్రామం చేర్చారు. అమెరికాలోని మాడిసన్ ప్రాంతం నుంచి విమానంలో హైదరాబాద్ చేరుకోగా అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో స్వగ్రామమైన బోడవాడకు బుధవారం వేకున్ఝామున తీసుకొచ్చారు. ఈ నెల 2న అమెరికాలో స్నేహితులతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా రోడ్డుపై మంచు గడ్డలు పేరుకుపోవడంతో అదుపుతప్పిన కారు బోల్తా పడిన ప్రమాదంలో అతను దుర్మరణం చెందాడు. రేవంతు తండ్రి రఘుబాబు పిజియో తెరపిస్టుగా పనిచేస్తుండగా తల్లి గతంలోనే మృతి చెందారు. రఘు బాబు ఒక్కగానొక్క ముద్దుల కుమారుడు రేవంత్ కోసం మరో వివాహం చేసుకోలేదు. కొడుకును ఉన్నత చదువుల కోసం అమెరికాకు పంపించారు. అమెరికాలో ఎంఎస్ చేసేందుకు డిసెంబర్ నెలలో వెళ్లిన రేవంత్ మృతి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులను కూడా కలిసి వేస్తోంది. మృతదేహాన్ని చూసి బంధువులు సన్నిహితులు బోరు బోరున విలపించారు. ఒక్కగానొక్కడు మృతి చెందడంతో రఘుబాబుని ఓదార్చడం ఎవరివల్లా కావడం లేదు. అంతిమ యాత్రకు పెద్ద సంఖ్యలో ప్రజలు, బంధువు వచ్చారు. గ్రామంలో విషాదం అలుము కుంది.



రేవంత్ (ఫైల్‌ఫోటో)



రేవంత్ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

ఆనందబాబుకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

టిడిపి అభ్యర్థి, మాజీ మంత్రి నక్క అనందబాబుకు మద్దతుగా టిడిపి శ్రేణులు బుధవారం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి తోనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో గడప గడపకు తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి, జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న నక్కా ఆనందబాబు, బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తు, రాజధాని నిర్మాణం, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చంద్రబాబును గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో టిడిపి శ్రేణులు



టిడిపిలో చేరిన వారితో ఏలూరి సాంబశివరావు

టిడిపితోనే పేదల అభివృద్ధి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పేదలపై సీఎం జగన్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను రద్దు చేశారని, జగన్ వికృత క్రీడకు అనేక మంది పేదలు బలయ్యారని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. మార్టూరు మండలం రాజుపాలెం, పర్చూరు మండలం పోతుకట్ల గ్రామాల నుంచి పలువురు ఆయన సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి ఆయన టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, అభివృద్ధిని విధ్వంసం చేసిన జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తానని అన్నారు. ప్రజలందరూ సంఘటితంగా వచ్చే ఎన్నికల్లో ప్రజాకూటమిని గెలిపించాలని కోరారు.

పర్చూరు : పేదల జీవితాల్లో మార్పు టిడిపితోనే సాధ్యం ఎంఎల్ఎ ఏలూరు సాంబశివరావు అన్నారు. మండలంలోని పోతుకట్ల గ్రామానికి చెందిన టీ మహేష్, ఎం ఏలియా, డి అన్వేష్, డి శేషుబాబు, ఎన్ సందీప్, ఆర్ సతీష్, ఎం వంశీ, ఆర్ లోకేష్, ఎం నాగరాజు, జి నాగేశ్వరరావు ఆయన సమక్షంలో టిడిపిలో చేరారు.



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న చేనేత నాయకులు

ఆత్మహత్యలను నివారించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రోజు రోజుకు క్షీణించి పోతున్న చేనేత పరిశ్రమ పరిరక్షించి, పనిచేసే కార్మికుల ఆత్మహత్యలు నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశీల్దారు ఐ మునిలక్ష్మికి చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ మాట్లాడుతూ అనంతపురం జిల్లా కేసేపల్లికి చెందిన నాగానందం, అన్నమయ్య జిల్లాలోని మదనపల్లిలో చేనేత కార్మికుడు జి మల్లికార్జునరావు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరి ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలుగా భావించి మృతి చెందిన చేనేత కుటుంబాలకు రూ.50లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు దీపాల సత్యనారాయణ, దొంతు కోటేశ్వరరావు, బట్టు నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం నాయకులు జి నాగరాజు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - అద్దంకి

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో విద్యార్థు లకు వ్యాస రచన, వకృత్వ పోటీ పరీక్షలు జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం కె శ్రీనివాసరావు ప్రారంభించారు. వకృత్వ పోటీలకు బండారు ఆనందరావు, అత్తలూరి శంకరరావు, కొంగల శ్రీనివాసరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వ్యాసరచన పోటీ పరీక్షలను దార్ల శ్రీనివాసరావు, వీరాంజనేయులు, పూర్ణచంద్రరావు, శ్రీకృష్ణ, అంకమ్మరావు పర్యవేక్షించారు. పరీక్షలకు మాల మహానాడు అధ్యక్షులు అంకం కిరణ్ కుమార్ సమన్వయ కర్తగా వ్యవహరించారు. విజేతలుకు ఈనెల 14న జరిగే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సభలో బహుమతులు అందింజేయనున్నట్లు తెలిపారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



రంజాన్ వేడుకల్లో చిన్నారులతో ప్రిన్సిపల్ షరీఫ్

'ఐ కిడ్స్'లో రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరి పట్టణంలోని ఐ కిడ్స్ పాఠశాలలో రంజాన్ పర్వదిన వేడుకలు పాఠశాల ప్రిన్సిపల్ షేక్ షరీఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ ప్రాముఖ్యతను ప్రిన్సిపల్ షరీఫ్ చిన్నారులకు వివరించారు. ఈ నెలలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు, ఫిత్రా జకాత్, దానధర్మాలు చేస్తుంటారన్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రమదాన్ మాసం అని పేర్కొన్నారు. స్నేహ భావం, సోదర భావంతో వుండాలని పాఠశాల డైరెక్టర్ రజియా అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు తయారు చేసిన నెల వంక ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టీచర్లు జబీనా, సంధ్య, నాగలక్ష్మి, షఫియా పాల్గొన్నారు.

టిడిపి కూటమి విస్తృత సమావేశం

పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బిఎన్ విజయకుమార్, తేనేటి కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ జనసేన బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమకు అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయం చేకూర్చాలని టిడిపి సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బీఎన్ విజయ్ కుమార్, టిడిపి బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి తేనేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పాలకేంద్రం సమీపంలోనున్న మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో బుధవారం సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ జనసేన బీజేపీ పార్టీల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంతనూతల పాడు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి బీఎన్ విజయ కుమార్, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి తేనేటి కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి తమ విజయానికి కృషి చేయాలని కోరారు. తాము నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బిఎన్ విజయ్ కుమార్

నియోజకవర్గం అభివృద్ధికి తాము కట్టుబడి ఉంటామని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు.

ఈ సమావేశంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు (బాబు), నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త మండవ రామకృష్ణ, పార్లమెంట్, నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామ నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, తెలుగు మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరినవారితో డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-సిఎస్ పురం

మండలంలోని కంభంపాడు గ్రామంలో 39 కుటుంబాల వారు వైసీపీని వీడి టిడిపిలో చేరారు. గ్రామ మాజీ సర్పంచ్ మేకల అంజయ్య, సచివాలయం కన్వీనర్ దాసరి మాధవరావు, చింతం సెల్వరాజ్, 2వ వార్డు సభ్యులు మేకల చిన్నదోశయ్య, దూపాటి వినోద్‌తో సహా పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బొమ్మనబోయిన వెంగయ్య, నాగిశెట్టి చిన్నమాలకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, రామకృష్ణంరాజు, ముప్పాళ్ల నరసింహారాజు, పాలకొల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, జి వెంకట్రామరాజు, చావా సుబ్బయ్య, బత్తుల వెంకటాద్రి, దాసరి మల్లికార్జున, మాజీ ఎంపీపీ తోటేటి పెద్దఅల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో టిడిపి కూటమి అభ్యర్థి భేటీ

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్‌లు దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను, ఆయన సోదరుడు మద్దిశెట్టి శ్రీధర్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల లో తమ గెలుపునకు సహకరించాలని కోరారు. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కార్యాల యంలో మద్దిశెట్టి అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం గొట్టిపాటి లక్ష్మి, కడియాల లలిత సాగర్‌లు కలవడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీ సందర్భంగా మద్దిశెట్టి శ్రీధర్ కూడా అక్కడ ఉన్నారు.



మద్దిశెట్టికి బొకే అందజేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

గొట్టిపాటి లక్ష్మి ప్రచారం

వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేస్తే చంద్రబాబు అధికారంలోకి వస్తారని, రాష్ట్రానికి మేలు జరుగుతుందని దర్శి టిడిపి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. బుధవారం దర్శి నగర పంచాయతీలోని 1, 20వ వార్డులలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అయ్యప్ప స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్డుల్లో పర్యటించారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మహిళలు పూలుజల్లుతూ స్వాగతం పలికి హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు ధారం సుబ్బారావు, ఏడుకొండలు, తిండి నారాయణ రెడ్డి, కొండయ్య, రామయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారంతో విజయాన్ని ఆపలేరు: డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

ఓటమి భయంతో ఎన్డీఏ కూటమిపై వైసిపి దుష్ప్రచారాలు చేయడం తగదని, దుష్ప్రచారాలతో విజయాన్ని ఆపలేరని కనిగిరి టిడిపి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్లో ఎన్డీఏ కూటమి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన వైసీపీ ఓటమి భయంతో దుష్ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. ఎన్డీఏ కూటమి గెలిస్తేనే వెనుకబడిన కనిగిరి అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎన్డీఏ కూటమిలోని ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. బిజెపి, జనసేన నియోజకవర్గ నాయకులు కొండిశెట్టి రమణయ్య, వరికూటి నాగరాజు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గెలుపునకు ఐక్యంగా కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, మనోహర్‌రావు, నంబల వెంకటేశ్వర్లు, రాచమల్ల శ్రీనివాసరెడ్డి, బేరి పుల్లారెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, కుందూరు తిరుపతిరెడ్డి, పిచ్చల శ్రీనివాసరెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, గుడిపాటి ఖాదర్, సుజల రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎం కొండయ్య

సైనికుల్లా పనిచేయాలి: కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

ఎన్నికల సమయం ఆసన్నమయ్యిందని తెలుగుదేశం పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, సమిష్టిగా సైనికులుగా పనిచేసి టిడిపిని గెలిపించుకోవాలని టిడిపి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చీరాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దులూరి మాలకొండయ్య అధ్యక్షతన చీరాల టౌన్ 33 వార్డు కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, వార్డు నాయకులు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీ మేనిఫెస్టో ప్రజలు విశ్వసిస్తున్నారని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. వార్డ్ కమిటీ సభ్యులతో సమావేశంలో చీరాల నియోజకవర్గ పరిశీలకులు నాతాని ఉమామహేశ్వరరావు, యువ నాయకులు గౌరీ అమర్నాథ్, మైనార్టీ నాయకులు యాసిన్, పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, 33 వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

పొగాకు కిలో అత్యధిక ధర రూ.237

ప్రజాశక్తి-సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి బుధవారం చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలెం గ్రామ రైతులు వేలం కేంద్రానికి 1,032 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 829 బేళ్ల కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 207 బేళ్లను తిరస్కరించారు. అత్యధిక ధర కిలో రూ.237 పలుకగా అత్యల్ప ధర రూ.220 పలికింది. సరాసరి ధర రూ.229.40 పలికింది. వేలంలో 18 కంపెనీలు పాల్గొన్నాయి. వేలం కేంద్రం నిర్వహణాధికారి రవికాంత్ వేలాన్ని నిర్వహించారు.

ఎన్నికల ప్రచారంలో ఉగ్ర జయసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తూరులో కనిగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన తనయుడు ముక్కు జయసింహారెడ్డి విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. చంద్రబాబు తీసుకువచ్చిన సూపర్ సిక్స్ పథకాలను, గతంలో ఎమ్మెల్యేగా తన తండ్రి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని సాగించారు. వెనుకబడిన కనిగిరి అభివృద్ధి చెందాలంటే టిడిపి విజయం సాధించాలన్నారు. పదవిలో ఉన్నా లేకున్నా పదవులతో పని లేకుండా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం పనిచేసే నాయకుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అని తెలిపారు. కనిగిరి అభివృద్ధికి చంద్రబాబు వద్ద తీసుకున్న 5 హామీలు అమలు జరగాలన్నా, వెనుకబడిన కనిగిరి కనకగిరిగా మారాలన్నా ప్రజాక్షేమం కోరే తన తండ్రి ఉగ్ర నరసింహారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టిడిపి నాయకులు తమ్మినేని సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉగ్ర జయసింహారెడ్డి ప్రచారం

సబ్ జైలు సమయాల్లో మార్పు

ప్రజాశక్తి-దర్శి

జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా సబ్ జైల్లో ఉన్న నిందితులను బంధువులు, స్నేహితులు కలుసుకునే సమయంలో మార్పులు చేసినట్లు దర్శి సబ్ జైల్ పర్యవేక్షణ అధికారి వెంకటరమణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు కలుసుకోవచ్చని ఆయన తెలిపారు. కాబట్టి నిందితులను కలుసుకునేవారు ఈ మార్పులు గమనించి ఆ సమయంలో రావాలని ఆయన కోరారు.

యాదవుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-చీరాల: రానున్న ఎన్నికల్లో నియోజక వర్గంలో వైసీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని సీఎం జగన్మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని పేరాల గోలి కళ్యాణ మండపంలో యాదవుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అర్హులైన లబ్ధిదారులు అందరికీ వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. ఈ పథకాల గురించి ప్రజలకు వివరించి వైసిపి గెలుపునకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పలువురు నాయకులు పాల్గొన్నారు. వేటపాలెం మండలం మక్కెనవారి పాలెంకు చెందిన 40 కుటుంబాలు చీరాలలోని కరణం స్వగృహంలో మాజీ శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. కరణం వెంకటేష్‌కు తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. మునిసిపాలిటీ 33వ వార్డులో కనపర్తి భూషణం, బొనిగల సందీప్, యర్రమత ఏసోబు, ప్రవీణ్, కట్టా ప్రవీణ్, నాని, దక్కుమళ్ళ శ్యామ్, మరియు కొందరు యువకులు చీరాల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్‌ను కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు కోండ్రు బాబ్జి, మొగిలి బాబ్జి, శిఖ సురేష్, తలకాయల సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కరణం వెంకటేష్‌కు మద్దతు ప్రకటిస్తున్న ప్రజలు

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పామూరు

మండల పరిధిలోని ఎల్లంపురం పంచాయతీలో వైసిపి నుంచి సుమారు 60 కుటుంబాలు చేరినట్లు మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి రవి ఆధ్వర్యంలో ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో కండువాలు కప్పుకొని ఎల్లనపురం గ్రామంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి తనను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో కాంట్రాక్టర్ గంజిగుంట సుబ్బారెడ్డి, మాజీ సర్పంచి ఏలికపాటి ఏసోబు, అరుణ్, రేగిచెట్టపల్లి గ్రామాల నుంచి 10 కుటుంబాలు చేరారు.



టిడిపిలో చేరినవారితో డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కదిరి భవాని ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-సిఎస్ పురం

కాంగ్రెస్ పార్టీ కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కదిరి భవాని బుధవారం సిఎస్ పురంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ అమలు చేయబోతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. గడప గడపకూ కాంగ్రెస్ విధానంతో ఆమె ప్రజల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద ప్రజల జీవితాలు బాగుపడతాయని, పేదల పక్షాన నిలబడే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఆమె కోరారు.



ప్రిన్సిపల్‌కు నగదు అందజేస్తున్న దాతలు

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో వంటపని చేసుకుని జీవనం సాగిస్తున్న కనపర్తి రాజేశ్వరి కూతురు లక్ష్మీగిరిజ స్థానిక విశ్వభారతి జూనియర్ కళాశాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఆర్థికంగా ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆమెకు గత సంవత్సరం కూడా మన మిత్రులు కొందరు కాలేజి ఫీజు రూ.16వేలు చెల్లించి సహకరించారని విశ్రాంత ఉపాధ్యాయులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈ ఏడాది కూడా ఆయనతో పాటు లక్కరాజు చంద్ర వేఖర్, చిన్నిమురళీకృష్ణ, డివిఎం సత్యనారాయణ, వామరాజు వెంకటేశ్వర్లు, జమ్మలమడక హనుమంతరావు, కారుమంచి వెంకట రమణారావు, ఈదర శివ ప్రసాదు, పి రఘురామయ్య, ఓ కవి మిత్రుడు, ఇలపావులూరి శేషతల్ప శాయి, ఓరుగంటి ప్రసాదు, పుట్టంరాజు తాండవకృష్ణ, పుట్టంరాజు చక్రధర్, లక్కరాజు శ్రీనివాసరావు, సయ్యద్ మౌలాలి, వైఎస్ఆర్‌కె ప్రసాదు, అద్దంకి శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకరరావు, తుర్లపాటి నాగార్జునరావు, లక్కరాజు విశ్వమోహన్, కంఠంరాజు శివరామ కోటేశ్వరరావు తమ సహకారం అందించారని తెలిపారు. రూ.16వేల నగదును లక్కరాజు చంద్ర శేఖర్, వామరాజ వెంకటేశ్వర్లు, పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి సమక్షంలో విశ్వభారతి కాలేజీ డైరక్టర్‌కు బుధవారం అందించారు.



బోడపాడు ఎన్నికల ప్రచారంలో అన్న రాంబాబు

జగన్‌తోనే సంక్షేమం : అన్నా

ప్రజాశక్తి - మార్కాపురం

రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని బోడపాడు గ్రామంలో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు సర్పంచి రమణారెడ్డి, మాజీ సర్పంచ్ బొగ్గు రవి చెన్నారెడ్డి, వైసీపీ నాయకులు పోరెడ్డి చెంచురెడ్డి గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రామాలయం వద్ద ప్రజలను ఉద్దేశించి ఆయనతో పాటు ఎపిఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి ఎంఎల్‌ఎగా తనను, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలని కోరారు. వివక్ష లేకుండా పథకాలు అందించిన వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎఎంసీ మాజీ చైర్మన్లు గుంటక సుబ్బారెడ్డి, బొలమ్రి శ్రీనివాస్ రెడ్డి, జడ్పిటిసి నారు బాపన్ రెడ్డి, ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కిలో అత్యధిక ధర రూ.238

ప్రజాశక్తి - కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో అత్యధిక ధర కిలో రూ.238 బుధవారం పలికిందని వేలం నిర్వహణాదికారి జి సునీల్‌కుమార్ తెలిపారు. ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం గ్రామాలకు చెందిన రైతులు 898 బేళ్లను అమ్మకానికి ఉంచారని తెలిపారు. అందులో 682 బేళ్లు కొనుగోలు చేయగా మిగిలిన 216 బేళ్లు వివిద కారణాల తిరిగి పంపినట్లు తెలిపారు. అత్యధిక ధర కిలో రూ.238, అత్యల్ప ధర కిలో రూ.220, సరాసరి ధర కిలో రూ.229.91 పలికిందన్నారు.

కంట్రోల్ రూమ్ సమర్థంగా పనిచేయాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఎన్నికల కంట్రోల్ రూమ్ 24గంటలు సమర్థంగా పని చేసేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. ఎంసిసి, సి-విజిల్ కంట్రోల్ రూమ్, మీడియా కోఆర్డినేషన్ మోనిటరింగ్ కమిటీ సెల్, సోషల్ మీడియా సెల్, వెబ్ క్యాస్టింగ్, ఎన్నికల గ్రీవెన్స్ సెల్ కంట్రోల్ రూమ్, 1950 హెల్ప్ లైన్ కేంద్రాలను ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించిన అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి నూతనంగా ఏర్పాటు చేసిన వీడియో సమావేశ మందిరం, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కోడ్ ఉల్లంఘించే అంశాలపై కంట్రోల్ రూమ్‌లోని నోడల్ అధికారులు నిశిత పరిశీలన ఉంచాలన్నారు. అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారాలు నిర్వహిస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఎన్నికల పరిశీలకులు జిల్లాకు రానున్న



పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్‌పి వకుల్ జిందాల్

నేపథ్యంలో వ్యవసాయ కళాశాల్లోని అతిథి గహం, ఆర్ అండ్ బి అతిథి గహాలను పరిశీలించారు.

మార్కాపురం : ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ బుధవారం రాత్రి స్థానిక డిఎస్‌పి కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, గదులు పరిశీలించారు. ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పాత బిల్డిగును పరిశీలించారు. ఆయన వెంట డిఎస్‌పి బాలసుందరం, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ఓటేయండి

ప్రజాశక్తి - మార్కాపురం

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉంటుందని, మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి అన్నా రాంబాబు, ఎంపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలని అన్నా రాంబాబు తనయుడు అన్నా కృష్ణచైతన్య కోరారు. పట్టణంలోని 26వ వార్డు తూర్పు ద్వారం ఏరియా, సత్య నారాయణ స్వామి గుడి వీధి, విజయలక్ష్మి స్ట్రీట్, శ్రావణి హాస్పిటల్ ఏరియా, పోతం వారి వీధి, కూరగాయల మార్కెట్ ఏరియాలోని ప్రతి ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి సిఎంగా చేయడం ద్వారా మార్కాపురం పట్టణ అభివృద్ధికి పాటుపడదామని కోరారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో



ఎన్నికల ప్రచారంలో అన్నా కృష్ణచైతన్య

సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జబర్దస్త్‌గా ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల్లో సందడి చేస్తున్న జబర్‌దస్త్ టీం సభ్యులు

ప్రజాశక్తి - మార్కాపురం

రాక్ వెల్ పబ్లిక్ స్కూల్ ఉగాది వేడుకల్లో జబర్‌దస్త్ బృంధం నవ్వులు పూయించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ వెన్నా పోలిరెడ్డి, వెన్నా నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు, తల్లి, దండ్రులను ఆకట్టుకున్నాయి. జబర్దస్త్ టీం ప్రదర్శించిన కామెడీ షో ఆద్యంతం ఉత్సాహంగా తిలకించారు. నిత్యం బిజీగా ఉండే పలువురు ప్రముఖులు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నంత సేపు చివరి వరకు తిలకించడం విశేషం. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి తనయుడు రాఘవ రెడ్డి దంపతులు, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థులు కందుల నారాయణరెడ్డి, గూడూరి ఎరిక్షన్ బాబు, ఉదయ్ శాట్ విజన్ అధినేత ఎస్ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు. వేడుకలకు హాజరైన ప్రముఖులకు స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ వెన్నా నాగర్జునరెడ్డి బొకేలు అందజేసి స్వాగతం పలికారు.

కందుల సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - కొనకనమిట్ల



టిడిపిలో చేరిన వారితో కందుల

మండలంలోని చిన్నమన గుండం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో బుధ వారం టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన రావుల చెన్నకేశవులు, రావుల చెన్నారా వు, రావుల బాలచెన్నయ్య, రావుల చెన్నకేశవులు, ఈర్ల గుణశేఖర్, ఈర్ల బాలవర్ధి, దోసపాటి బాలగురవయ్య, ఈర్ల బాలరాజు, రావుల బాలగురవయ్య, రావుల చంద్రశేఖర్, కసిబిసి చిన్నకొండయ్య, దోసపాటి నవీన్, కంబుగుంట్ల పాపయ్య, ఈర్ల హరికష్ణ, కసిబిసి రవి, కసిబిసి చంద్రయ్య, ఈర్ల రామయ్య, గుంటేయ్య, బత్తుల సురేష్, కందుల యేసయ్య, కందుల ఇర్మియ, పాలబోయిన పుల్లయ్య, బాల నరసింహులకు టిడిపి కండువాలు కప్పి టిడిపిలోకి నారాయణరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు టిడిపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి సన్నిహితుడు బెజవాడ సురేష్‌రెడ్డి, ఎం బాబురావు, మాజీ ఎఎంసీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య, గోట్లగట్టు సర్పంచి పెరికే సుకుదేవ్, మువ్వా కాటమరాజు, తాటిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, దేవిరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



ఎంపీడీఓ రాజీనామా పత్రాలను అందజేస్తున్న వాలంటీర్లు

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మండలంలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన 8 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేస్తూ పత్రాలు ఎంపీడీఓ తోట చందనకు బుధవారం అందజేశారు. మండలంలో 311మంది వాలంటీర్లు ఉండగా వారిలో ఇప్పటివరకు 11మంది రాజీనామాలు చేశారని తెలిపారు. ఈసందర్భంగా వాలంటీర్లు మాట్లాడారు. తమను విధులకు దూరంగా ఉండాలని ఇచ్చిన ఉత్తర్వుల వెనుక రాజకీయ ప్రమేయం ఉందేనే మనస్తాపంతో రాజీనామా చేసినట్లు తెలిపారు.



పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న ఆర్‌ఓ రాహుల్‌మీనా

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పొదిలి

ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ సలెక్టర్ రాహుల్ మీనా సూచించారు. మూగచింతల, కొండాయ పాలెం, దొండ్లేరు, ఓబులక్కపల్లి, మాదాలవారి పాలెం, కంభలపాడు, పొతవరం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. పోలింగ్ జరిగే గదులు, టాయిలెట్‌లు, ఇతర వసతులను పరిశీలించారు. తహశీల్దారు మహమ్మద్ జియా, పొదిలి సిఐ మల్లిఖార్జునరావు, ఎస్సై జి కొటయ్య ఉన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - శింగరాయకొండ

స్థానిక సర్కిల్ కార్యాలయంలో రౌడీ షీటర్లకు బుధవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. సిఐ దాచేపల్లి రంగనాథ్ రౌడీ షీటర్లతో మాట్లాడారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని అన్నారు. ఆయన వెంట ఎస్ఐ టి శ్రీరామ్ ఉన్నారు.

చీమకుర్తి : రాబోయే ఎన్నికల సంధర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన కఠినంగా శిక్షిస్తామని సిఐ దుర్గాప్రసాదు పేర్కొన్నారు. మండలంలోని రౌడీషీటర్లుకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన బుధవారం కౌన్సింగ్ ఇచ్చారు.

పొదిలి : మండలంలోని రౌడీషీటర్లు గొడవలకు దూరంగా ఉండాలని సిఐ మల్లికార్జున చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లుగా నమోదైన వారికి బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్సై జి కొటయ్య ఉన్నారు.

ఆ హుండీ ఆదాయం ఎవరిది?

ప్రజాశక్తి - కొండపి

ఉగాది సందర్భంగా మండలంలోని జాళ్లపాలెంలో శ్రీ బ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారులు ఆలయానికి సంబందించిన వేలం పాటలు నిర్వహించారు. గతంలో జీవసమాది అయిన స్వామివారి కుటుంభ సభ్యులు ఆలయ నిర్వహణ పౌరహిత్యం నిర్వహించేవారు. గత రెండేళ్ల నుంచి ఓ నాయకుడు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో పాటలు నిర్వహించి వ్యాపారస్తుల నుండి వేలం ద్వారా నిదులు వసూలు చేస్తున్నారు. ఆలయంలో అధికారికంగా సీలు చేసిన హుండీ ఉండగా ప్రత్యేకంగా ఆలయం ఎదుట బిందెల రూపంలో హుండీలు ఏర్పాటు చేసి భక్తుల నుండి కానులు వసూలు చేయటం ఏమిటని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. గుడి అభివృద్ధికి గుడిలో హుండీ ఉండగా అనాధికారికంగా గుడి ముందు హుండీ ఏర్పాటు చేసి వసూలు చేస్తున్న కానుకలు ఎవరి జేబులు నిపేందుకని భక్తులు బహిరంగంగానే ఆరోపించారు. సాక్షాత్తు ఎండోమెంట్ సిబ్బంది ఆద్వర్యంలోనే అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తున్నారు.

బసవన్న పాలెంలో 'భవిష్యత్‌కు గ్యారెంటీ'

ప్రజాశక్తి - మద్దిపాడు



ప్రచారంలో విజయకుమార్

మండలం లోని బసవన్న పాలెంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి బిఎన్ విజయ్ కుమార్ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా కషి చేయాలని కోరారు. పలువురు టిడిపిలో చేరారు. వారికి టిడిపి కండువాలు కప్పి ఆహ్వానిం చారు. టిడిపి అధ్యక్షులు మండవ జయంత్ బాబు, ఎఎంసీ మాజీ చైర్మన్ మండవ రంగారావు, కొప్పోలు విశ్వనాథ్, అబ్బురీరి శేషగిరి, జనసేన అధ్యక్షుడు నున్న బాలసుబ్రమణ్యం, గోవిందరాజులు, ప్రభాకర్, బి రాజా, పాపారావు, నరసింహారావు, శ్యామ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
గురువారం 11 ఏప్రిల్ 2024

జొన్న, మొక్కజొన్న రైతుకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈ ఏడాది రబీ సీజన్లో రైతులు సాగుచేసిన జొన్న, మొక్కజొన్న పంటలకు నీళ్లు అందక రైతులకు తీవ్ర నష్ట పోయే ప్రమాదం ఏర్పిండింది. మండలంలో 16వేల ఎకరాల్లో మొక్కజొన్న జొన్న పంటను సాగు చేశారు. బోరు వసతి కలిగిన వెల్లటూరు, పెద్దపులివర్రు, సూరేపల్లి, ఓలేరు గ్రామాలు మినహా అద్దేపల్లి, కోనేటిపురం, పల్లికోన, రాచూరు, ఐలవరం గ్రామాల్లో సాగురు నీటిపై ఆధారపడి సాగుచేసిన మొక్కజొన్న, జొన్న పంటలు ఎండలకు నీరు లేక పూర్తిగా ఎండిపోయాయి. రబీలో సాగునీరు ఇవ్వలేమని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ రైతులు త్రాగునీటికైనా నీరు విడుదలవుతుందని, వాటి ద్వారా కాలువలకు అందుబాటులో ఉన్న పొలాల్లో జొన్న, మొక్కజొన్నకు రెండు తడులైన నీటిని పెట్టుకోవచ్చని భావించి సాగు చేశారు. కానీ నీటిపారుదల శాఖ అధికారులు సంక్రాంతి సమయంలో మాత్రమే ఒక విడత కాలువలకు అరకొరగా వారం రోజులు నీటిని విడుదల చేయగా ఆ నీటిని జొన్న, మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు ఒక తడిని ఆయిల్ ఇంజన్ల ద్వారా అందించగలిగారు. మరోసారి మహాశివ రాత్రి సమయంలో కాలువలకు నీరు విడుదలవుతుందని ఆశించారు. ఆ సమయంలో రెండవ విడత నీటిని పొలాలకు అందించవచ్చని భావించారు. ఆ మేరకు నీటి కోసం ఈ ప్రాంత రైతులు ఎదురు చూశారు. కానీ ఎలాంటి నీటి చుక్క విడుదల లేకపోవడంతో ఎండిపోతున్న పంటలను చూసి తట్టుకోలేక కొంతమంది రైతులు అధికవ్యయ ప్రయాసలకు లోనై బోర్లను ఏర్పాటు చేశారు. భూగర్భ జలాలు లేని ఈ ప్రాంతాల్లో వేసిన బోర్లు కూడా నీరు లేక చేసిన ఖర్చులు అప్పుల రూపంలో మిగిలిపోయాయని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు బోర్లు కోసం మరోసారి అప్పులు చేయలేమని, పంటలు పండిన కాడకే పండుతాయని దేవునిపై భారం వేసి వదిలేశారు. ఎకరాకు ఐదు నుండి 10బస్తాలే దిగుబడి సాగునీరు లేక ఎండిపోయిన జొన్న, మొక్కజొన్న పంటలకు ఎకరాకు దిగుబడి 5నుండి 10బస్తాలు మాత్రమే లభిస్తుందని, అదీ కూడా నాణ్యత లేకుండా, బరువు తక్కువతో గింజలు వస్తున్నాయని రైతులు చెబున్నారు. మొక్కజొన్న పంటకు విత్తనం కొనుగోలు నాటి నుండి ఇప్పటివరకు ఎకరాకు రూ.25వేల నుండి రూ.30వేల వరకు ఖర్చు చేశామని తెలిపారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయి దిగుబడులు లేకపోవడంతో పండిన ఐదారు బస్తాలకు లభించే రూ.10వేల నుండి రూ.15వేలు ఆదాయంతో మరో రూ.10వేల నుండి రూ.15వేలు నష్టాలను ఎదుర్కొనాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రబీలో సాగుచేసిన పంటలకు విభిన్న రీతిలో వ్యత్యాసాలు ఉన్నాయి. ఏడాది సాగుచేసిన మినుము, పెసర పంటలకు దిగుబడులు, ధరలు ఆశ జనకంగా ఉండటంతో ఆ పంటలు సాగు చేసిన రైతులకు కొంతమేర ఊరట లభించింది.



సాగునీరు అందక ఎండిపోయిన మొక్కజొన్న



వైసిపిలో చేరిన కార్యకర్తలతో అన్నా రాంబాబు

అన్నా సమక్షంలో వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - మార్కాపురం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎంఎల్ఎ అన్నా రాంబాబు, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి గెలుపుకు తామంతా కృషిచేస్తామని పలువురు పేర్కొన్నారు. పొదిలి పట్టణం విశ్వనాధపురం 10వ వార్డు బీసీ కాలనీకి చెందిన 30టిడిపి కుటుంబాలు శ్రావణి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మార్కాపురం మండలం బోడపాడు గ్రామానికి వచ్చి ఎంఎల్ఎ అన్నా రాంబాబు సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి వైసిపి కండువా కప్పి రాంబాబు సాదరంగా ఆహ్వానించారు. పొదిలి అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు. ఎపిఐఐసి ఛైర్మన్, వైసిపి జిల్లా అద్యక్షులు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ వైకసిపి అభ్యర్థుల గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. శ్రావణి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశయాలు, అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి టీడిపి నుంచి వైసిపిలో చేరినట్లు తెలిపారు. వైసిపిలో చేరిన వారిలో పాశం కొండయ్య, జి రామారావు, మధు, జింధాల్ వలి, మల్లి, నరేంద్ర, ఆది, మారాసి వెంకటేశ్వర్లు, రమణయ్య, శ్రీను, చిన్నా, జి నాగరాజు, సుబ్బారావు, చాతరాజుపల్లి శ్రీనివాసులు, షేక్ మస్తాన్వలి, కె దుర్గారావు, జి కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



బాలాజీ గెలుపు కోరుతూ వైసిపి నేతల ప్రచారం

బాలాజీ కోసం ప్రచారం

ప్రజాశక్తి - పర్చూరు

సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి యడం బాలాజీ గెలుపుల కోసం వైసిపి నాయకులు బుధవారం ప్రచారం చేశారు. స్థానిక ఇందిరా కాలనీలో గడప గడపకు వెళ్లి సిఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. సంక్షేమం మళ్ళీ కొనసాగాలంటే వైసిపి అభ్యర్థులు యడం బాలాజీ, బాపట్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌కు ఓటు వేయాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు.

ఎవరు అభివృద్ధి చేశారో చూడండి

మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం

ప్రజాశక్తి - బట్టిప్రోలు

రాష్ట్రంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో ప్రజలు గమనించి ఓటు వేయాలి కాంగ్రెస్ బాపట్ల ఎంపీ అభ్యర్థి, మాజీ కేంద్రమంత్రి జెడి శీలం కోరారు. వేమూరు నియోజకవర్గస్థాయిలో భట్టిప్రోలులోని రామాగుప్తా కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన కాంగ్రెస్ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు తాడికొండ వెంకటేశ్వ రరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో శీలం మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం గత పదేళ్ళుగా రాష్ట్రానికి బిజెపి తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక హెూదా కల్పించాలని, రాజధాని అభివృద్ధికి నిధులు కేటాయించాలని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీటిని అందించాలని, రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే అంశాలను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి బోరక సుబ్బారావును, ఎంపి అభ్యర్థిగా తనకు హస్తం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ భట్టిప్రోలు మండల అధ్యక్షులు పోతార్లంక ఏడుకొండలు, కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు మండలాల అధ్యక్షులు ఉన్నారు.



సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం

మద్యం అక్రమాలు నిర్మూలించాలి

ప్రజాశక్తి - బాపట్ల

మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంద్యం అక్రమ వ్యాపారాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని డిప్యూటీ కమిషనర్ కె శ్రీనివాసులు స్థానిక అధికారులను ఆదేశించారు. స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్ల ఎన్ ఫోర్స్ మెంట్ స్టేషన్ పరిధిలోని స్టువర్టుపురం, వెదుళ్ళపల్లి, చినభేతపూడి గ్రామాల్లో కాపుసారా తయారీ స్థావరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. కాపు సారా తయారీ నియంత్రణకు తీసుకోవలసిన ముందస్తు చర్యలను అధికారులకు వివరించారు. అనధికార మద్యం విక్రయాలు, మద్యం అక్రమ నిల్వ ప్రదేశాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి దాడులు చేయాలని చెప్పారు. సమావేశంలో బాపట్ల సెబ్ సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఇబి జిల్లా అధికారి సిహెచ్‌వి మహేష్ కుమార్, సూపెరింటెండెంట్ గోవింద నాయక్, అసిస్టెంట్ సూపెరింటెండెంట్ (హెడ్ క్వార్టర్స్) ప్రభాకరరావు, వి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలిస్తున్న డిసి కె శ్రీనివాసులు

వైసీపీలో దళితులకు అన్యాయం

ప్రజాశక్తి - బాపట్ల

దళితులకు వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక నష్టాలపై దళిత వర్గాలను చైతన్యపరిచే ప్రచారాన్ని ప్రారంభిస్తామని అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జి చార్వాక, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్ బాబు తెలిపారు. స్థానిక ఎఎన్‌పిఎస్ కార్యాలయంలో సంయుక్తంగా బుధవారం నిర్వహించిన విలేకరులు సమావేశంలో మాట్లాడారు. దళిత హక్కుల సాధనకై మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో టిడిపి అధినేత చంద్రబాబుకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఉన్న 27సంక్షేమ పథకాలను జగన్మోహన్‌రెడ్డి రద్దు చేశారని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విదేశీ విద్య పేరును జగన్మోహన్‌రెడ్డి పేరుగా మార్చారని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి కొనుగోలు పథకాన్ని రద్దు చేశారని అన్నారు. విశ్వ విద్యాలయాల్లో పీజీ కోర్సులు చేస్తున్న దళిత విద్యార్థులకు స్కాలర్‌షిప్ రద్దు చేశారని గుర్తు చేశారు. ఎయిడెడ్ పాఠశాలలు రద్దుచేసి ఎందరో దళిత విద్యార్థులను చదువుకు దూరం చేశారని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దయిన పథకాలు తిరిగి అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు తెలిపారు.



చంద్రబాబును కలిసిన దళిత నాయకులు



అగ్ని ప్రమాద బాధితులకు సహాయం చేస్తున్న బాలసేవ సంస్థ

బాలసేవా సంస్థ వితరణ

ప్రజాశక్తి - వేమూరు

కొల్లూరు మండలంలోని తడికలపూడి గ్రామంలో ఇటీవల రావుల కిరణ్ బాబుకు చెందిన పూరిళ్లు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. కట్టుబట్టలతో మిగిలిన కిరణ్ బాబు కుటుంబానికి బాల సేవా సంస్థ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు, బియ్యం, దుస్తులు, కొంత నగదును బుధవారం అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు బాల సేవా సంస్థ ముందుంటుందని సంస్థ సభ్యులు కొరిటపాటి బాబ్జి తెలిపారు. కార్యక్రమంలో నన్నేపాముల నాగేశ్వరరావు, గోరిగపూడి ప్రసన్నకుమార్, సునీత పాల్గొన్నారు.



వైసీపీలో చేరిన పెదగదెలవర్రు మాజీ సర్పంచ్ ప్రభాకర్

వైసీపీలో చేరిన మాజీ సర్పంచి

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం పెదగాదలవర్రు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గాజులవర్తి ప్రభాకర్ వైసీపీ ఎంఎల్ఎ అభ్యర్థి వరికూటి అశోక్ బాబు సమక్షంలో వైసీపీలో బుధవారం చేరారు. ఆయనకు వైసిపి కండువా కప్పి పార్టీలోకి అశోక్‌బాబు ఆహ్వానించారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన పలువురు టిడిపి కార్యకర్తలు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కొనసాగటానికి మరోసారి జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు గాజులవర్తి కోటేశ్వరరావు, దాసు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి ఆనందబాబు

12న ప్రజాగళం బహిరంగ సభ

ప్రజాశక్తి - కొల్లూరు

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 12న చంద్రబాబు ప్రజాగళం రోడ్ షో నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి నక్క ఆనందబాబు తెలిపారు. మండలంలోని గౌడపాలెం, కాశీకృష్ణ గుడి వద్ద ప్రజాగళం బహిరంగ సభ శుక్రవారం జరుగుతుందని తెలిపారు. ఒక్క ఛాన్స్ అన్నాడని జగన్మోహన్ రెడ్డిని అందలమెక్కించి ప్రజలు తప్పు చేశామని అనుకుంటున్నారని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. వైసీపీకి అభ్యర్థులు కరువై ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురికి సీట్లు ఇచ్చే పరిస్థితి వచ్చిందని అన్నారు. శుక్రవారం జరిగే ప్రజాగళం బహిరంగ సభకు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి ఊస రాజేష్, టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత అధికార రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ కనకాల మధుసూదన ప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు చలమయ్య పాల్గొన్నారు.


కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

గ్రానైట్ కార్మికులు

ఓటు హక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-చీమకుర్తి

మినీ ఇండియా లాంటి చీమకుర్తి ప్రాంతంలోని ప్రతి కార్మికుడు ఓటు హక్కు వినియోగించేకునేలా యజమానులు,గ్రానైట్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దినేషకుమార్ ఆదేశించారు. రామతీర్థం సమీపంలోని గ్రానైట్ క్వారీలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మైన్స్ డీడీ జగన్నాధరావుతో కలిసి కార్మికులతో ఓటుహక్కుపై బుధవారం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విటిసి మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఓటు హక్కు చాలా విలువైందని తెలిపారు. గ్రానైట్ పరిశ్రమలో దాదాపు 12వేల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారు తమ ఓటు హక్కు వినియోగించేకునేలా యజమానులు అనుమతులు ఇవ్వాలన్నారు. అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైన్స్ డీడీ జగన్నాధరావు, స్వీప్ నోడల్ అధికారులు రవి, జ్యోతి, వెంకటస్వామి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్ చీమకుర్తిలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. వివిధ విభాగాల ఏర్పాటు, ఫిర్యాదుల పరిష్కారం గురించి ఆరా తీశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

అనుమానాస్పద నగదు లావాదేవీలపై

బ్యాంకు అధికారులు నివేదికలు ఇవ్వాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బ్యాంకుల నుంచి అనుమానాస్పద నగదు లావాదేవీలపై బ్యాంకు అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బ్యాంకు అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ వేసే అభ్యర్థులు కొత్తగా బ్యాంకు ఖాతా తెరవడానికి అధికారులు సహకరించాలన్నారు. బ్యాంకు ఖాతాల నుంచి రోజుకు రూ.10 లక్షలు, అంతకంటే ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలు జరిపిన వివరాలు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. నెలవారీగా రూ.50 లక్షలు, అంతకంటే ఎక్కువ మొత్తంలో లావా దేవీలపై నివేధించాలన్నారు. అసాధారణమైన, అనుమానాస్పద నగదు ఉపసంహరణ లేదా బ్యాంకులో నగదు డిపాజిట్ చేసే ఖాతాలపై దష్టి సారిం చాలన్నారు. డిపాజిట్ లేదా ఉపసంహరణకు సంబంధించిన ఎలాంటి సందర్భాలు లేకుండా రూ.ఒక లక్ష కంటే ఎక్కువ నగదు లావాదేవీలు జరిపిన ఖాతాలను పరిశీలిం చాలన్నారు.ఆర్‌టిజిఎస్ లేదా రెమిటెన్స్‌ల విధానంతో చేసే నగదు బదిలీపై నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు, ఎల్‌డిఎం శివకష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

వివిఎం, వివిపాడ్స్ ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల సమక్షంలో ఈనెల 12న నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ బాషా మాట్లాడుతూ బాపట్ల సెగ్మెంట్‌లోని అసెంబ్లీ నియోజక వర్గాలకు ఇవిఎంలు, వివిపాడ్స్ యంత్రాల కేటాయింపు ఉంటుందన్నారు. ఓటు వేసేందుకు ఇసిఐ ధ్రువీకరించిన 12 రకాల గుర్తింపు కార్డులను అనుమతిస్తున్నట్లు వివరించారు. ఈనెల 18 నుంచి 25 వరకూ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ జరుగ ుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డి.రవి, సిపిఎం నాయకుడు శరత్, బిఎస్‌పి నాయకుడు కె.కోటేశ్వరరావు, బిజెపి నాయకుడు కెవి.రామకష్ణ, టిడిపి నాయకుడు షేక్ మహమ్మద్ గౌస్, వైసిపి నాయకుడు ఐ.మాల్యాద్రి పాల్గొన్నారు.

కార్మికులు పని ప్రదేశాలలో జాగ్రత్తగా ఉండాలి

ఒంగోలు సబర్బన్ : వేసవి నేపథ్యంలో మున్సిపల్ కార్మికులు తాము పనిచేస్తున్న ప్రదేశాలలో జాగ్రత్తగా ఉండాలని పలువురు వైద్యులు సూచించారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో కొత్తపట్నం బస్టాండ్ వద్ద నున్న ఐదో మస్టర్ పాయింట్ వద్ద బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు మాట్లాడుతూ వేసవిలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తల గురించి కార్మికులకు వివరించారు. వడగాల్పులకు గురి కాకుండా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ ఎన్.పిచ్చయ్య, పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఆయుష్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మాదిగలకు అండగా ఉంటా : బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మాదిగలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని, రానున్న ఎన్నికల్లో వైసిపిని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు అందరూ సహకరించాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోరారు. స్థానిక బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో మాదిగల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడారు. మాదిగలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి పాటు పడుతున్న వైసిపిని మరోసారి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్ము కనకారావు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి వకుల్ జిందాల్ సూచించారు. ఎస్‌పి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నోడల్ పోలీస్ అధికారులు, ఎఫ్ఎస్‌టి బందాలతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి పనితీరును అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు జిల్లాలో మొత్తం 18 ఎఫ్ఎస్‌టి బందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఎవరూ అతిక్రమించకుండా పరిరక్షించేందుకు ఈ బందాలు రోజులో 24 గంటలు విధులు నిర్వహించే విధంగా మొత్తం 216 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. సివిజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి నిర్దిష్ట సమయం లోపు ఆ ప్రదేశానికి చేరుకుని సమస్యపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ మద్యం, నగదు, బహుమతులు, ఇతర వస్తువుల అక్రమ రవాణా కట్టడికి వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. గ్రామాలను తరచూ సందర్శించి గ్రామస్తులతో సమావేశమై ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించాలన్నారు. సిబ్బంది ఎవరైనా ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారి పై చట్టపరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ఈ సమా వేశంలో ఎన్నికల విభాగం ఇన్‌స్పెక్టర్లు ఎ.శ్రీనివాసరెడ్డి, సిహెచ్. సింగయ్య , నోడల్, పోలీస్ అధికారులు, ఎఫ్ఎస్‌టి బృంద సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్‌పి

చంద్రబాబు మాటలను వాలంటీర్లు నమ్మడం లేదు

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మాటలను వాలంటీర్లు నమ్మే పరిస్థితిలో లేరని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక 21వ డివిజన్ అంబేద్కర్ భవన్ సమీపంలోని అంబేద్కర్ కాలనీలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వాలంటీర్ల విషయంలో చంద్రబాబు నాయుడు రోజుకో మాట మాట్లాడుతున్నారని చెప్పారు. ఒకరోజు వాలంటీర్లు వద్దు అంటాడు, ఒకరోజు వారు వైసిపికి పనిచేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడుతారని బెదిరిస్తాడు, ఇప్పుడు అధికారంలోకి వస్తే నెలకు రూ.10వేలు ఇస్తానని చెబుతున్నాడు....!ఇవన్నీ వాలంటీర్లు, ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు. 2014లో ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయుడు అమలు చేయలేదని చెప్పారు. ఇప్పుడు మరలా అధికారంలోకి రావడం కోసం ఏవేవో వాగ్ధానాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఆలోచించి రానున్న ఎన్నికల్లో ఓట్లు వేయాలని కోరారు. ఒంగోలులో ఐదేళ్లలో సంక్షేమ పథకాలు కొనసాగాయని, ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని చెప్పారు. రూ.330కోట్లతో రోజు తాగునీటి పథకాన్ని తీసుకు వచ్చామని, పనులు మరో ఏడాదిలో పూర్తి అవుతాయని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవు తోందని ప్రజలంతా నమ్ముతున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ యనమల నాగరాజు, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి